క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



వెల్దండ: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంపీఓ లక్ష్మణ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మినోనిపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులలోని చెత్తచెదారం కార్మికులతో శుభ్రం చేయించారు. రోడ్లపై చెత్తవేయకుండా పంచాయతీ ట్రాక్టర్లలో చెత్త వేయాలని ప్రజలకు వివరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేశ్వర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

తాడూరు: మండల కేంద్రంతో పాటు యత్మాతాపూర్, శిర్సవాడ గ్రామాల్లోని శివాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకం నిర్వహించిన అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రావణ మాసం విశిష్టత గురించి వివరించారు. పూజారి జంగం శంకరయ్య పాల్గొన్నారు.

రైతులు డిక్లరేషన్ సమర్పించాలి

ఉప్పునుంతల: మండలంలో రూ. 2 లక్షలు రుణమాఫీ కాని రైతులు సంబంధిత ఏఈఓలకు డిక్లరేషన్ అందజేయాలని మండల వ్యవసాయాధికారి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిక్లరేషన్ ఇవ్వాల్సిన రైతుల జాబితా ఏఈఓ వద్ద అందుబాటులో ఉందని తెలిపారు.

ఆర్డీఓకు వినతి

కల్వకుర్తి రూరల్: అదేవిధంగా రవాణా నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను టెండర్ల ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఆర్డీఓ శ్రీనునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికులకు అన్యాయం చేస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, రాజు, దర్శన్‌రెడ్డి, యాదయ్య, వెంకటయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు వేలి ముద్రల సేకరణ

మన్ననూర్: నేరాల నియంత్రణకు వేలిముద్రల సేకరిస్తున్నట్లు అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్ తెలిపారు. మంగళవారం మన్ననూర్ బస్టాండ్ పరిసర ప్రాంతంతో పాటూ జనసంచారం అధికంగా ఉన్న వివిధ ప్రాంతాల్లో ప్రజల నుంచి వేలి ముద్రలను సేకరించారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. నేరాల అదుపునకు వేలి ముద్రలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అమ్రాబాద్ పోలీసులు వీరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

లింగాల: మండలంలోని మాడాపూర్‌కు చెందిన రైతు అడివయ్య సంబంధించిన పొలంలో పైపులు పగులగొట్టిన సోదరుడు మద్దిలేటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ మంగళవారం తెలిపారు. కొన్ని రోజులుగా అన్నదమ్ముల మధ్య భూతగాదాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో మద్దిలేటి అన్న అడివయ్య పొలంలో ఉన్న పైపులను ధ్వంసం చేశాడు. ఈ మేరకు అడివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అధికారుల సూచనలు పాటించాలి

వెల్దండ: అధికారుల సూచనలు రైతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి శోభారాణి పేర్కొన్నారు. మంగళవారం రాచూర్ రైతు వేదికల్లో వ్యవసాయ కమిషరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు సలహాలు, సూచనలు చేశారని ఏఓ తెలిపారు. సాగుచేసిన పంటలకు చీడపీడల నివారణకు ఉపయోగించే మందుల పిచికారీ గురించి అవగాహన కల్పించారని వివరించారు. అర్హులందరికీ రుణమాఫీకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఏఈఓలు గణేష్, సురేష్, సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

తప్పొప్పులను సరిచేయాలి



వెల్దండ: ఓటరు జాబితాలో తప్పొప్పులను సరిచేయాలని కోరుతూ రాచూర్ గ్రామస్తులు మంగళవారం కార్యదర్శి పద్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ సభ్యుల అందరి పేర్లు వరుస క్రమంలో ఒకే వార్డులో ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు అనిల్‌కుమార్, వెంకటయ్య, జంగయ్య, సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



తాడూరు మండలం అల్లాపూర్‌లో పోతురాజుల విన్యాసాలు



నాగర్‌కర్నూల్ పోచమ్మ దేవాలయం వద్ద బోనాలు సమర్పించేందుకు బారులు తీరిన మహిళలు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం పోచమ్మ బోనాలు పండుగను నిర్వహించారు. పట్టణంలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. మహిళలు పూనకాలు ఊగారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా మంతటిలో పోచమ్మ, గౌరమ్మకు బోనాలు సమర్పించారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్లలో పోచమ్మ బోనాల సందర్భంగా కోళ్లు, పొటేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించారు. మహిళలు బోనాలతో ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు ఉన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట, మాధవస్వామినగర్ గ్రామాల్లో సుంకులమ్మకు బోనాలు సమర్పించారు. యువకులు నృత్యాలు చేశారు. మహిళలు బొడ్డెమ్మలు ఆడారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు నాగులపల్లిలో పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు యాదిరెడ్డిపల్లి, గుంతకోడూరు, అల్లాపూర్, ఇంద్రకల్ గ్రామాల్లో మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలను చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు పెద్దకార్పాముల, కల్వకోలు, చిన్నకొత్తపల్లి పోచమ్మ బోనాల సందర్భంగా పోతురాజులు విన్యాసాలతో ఆకట్టుకున్నారు. మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ, శశికళ, శివశంకర్, చంద్రయ్య, ఎల్లయ్య, లక్ష్మయ్య, అశోకరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి నాగేషి తదితరులు పాల్గొన్నారు.



కోడేరులో..



నాగర్‌కర్నూల్‌లో..



పెద్దకొత్తపల్లిలో ..

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: అర్హులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని రాష్ట్ర రైతు సంఘం సహాయ కార్యదర్శి వార్ల వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా 22 లక్షల మందికి రుణమాఫీ కాలేదని రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అదే విధంగా 10 ఎకరాలు కలిగిన రైతులకు రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కృష్ణాజీ, కేశవులుగౌడ్, శంకర్, శివశంకర్, మధుగౌడ్, కొండన్న గౌడ్, కుతుబుద్దీన్, వేణిపల్లి రవీందర్, వెంకటస్వామి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, తిరుపతిరెడ్డి, బాలస్వామి పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: రైతులందరికి రుణమాఫీ చేయాలని, పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కిషోర్ డిమాండ్ చేశారు. సంఘం పిలుపు మేరకు మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓకు అందజేశారు. రఘుమారెడ్డి, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, లింగమయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

బ్యాంకు ఎదుట బారులు తీరిన రైతులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకు వద్ద మంగళవారం రైతు రుణమాఫీ పొందిన రైతులు బారులు తీరారు. భూమి పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు, అకౌంట్ బుక్ అందజేసి రుణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు గ్రామాల నుంచి రైతులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. మండలంలో ఇప్పటి వరకు 3 విడుతల్లో 7230 మంది రైతులు రుణమాఫీ పొందారు. మండలంలో మొత్తం 18160 మంది రైతులు రుణాలు తీసుకున్నారు. రుణమాఫీ కాని రైతులు అవసరమైన పత్రాలను ఏఈఓలకు అందజేస్తున్నారు.



ఏపీజీవీబీ బ్యాంకు వద్ద క్యూలైన్‌లో ఉన్న రైతులు

స్వర్ణకారులను ఆర్థికంగా ఆదుకోవాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న స్వర్ణకారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఆయన రాష్ట్ర సంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కార్యదర్శిగా గన్నోజు రాజు ఎంపిక చేసినట్లు చేశారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం నాయకులు నాగరాజు, రవీంద్రాచారి, రాజు, విష్ణుమూర్తి, కేశవాచారి, రజిత తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో చోరీ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో ఉన్న కాలనీలో చోరీ అయిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ–2 రాంచందర్‌జీ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని శ్రీసాయి వాసవీనగర్ కాలనీలో కోటయ్య నివాసంలో గుర్తుతెలియని దొంగలు రూ.50 వేలు చోరీ చేశారు. బాధితుడు స్థానిక పోలీసులకు సమాచారమివ్వగా వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కోటయ్య దంపతులు కూలీ పనులు చేసుకుంటూ పోగు చేసిన డబ్బులు చోరీకి గురికావడంతో బోరున విలపించారు.

బాల్యవివాహాలపై అవగాహన



లింగాల: కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని లింగాల, పద్మన్నపల్లి సూరాపూర్ గ్రామాల ప్రజలకు బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. సంస్థ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు

మన్ననూర్: స్థానిక ఆర్ఐటీఐ సమీపంలో వెలిసిన ఎల్లమ్మతల్లి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి మంగళవారం భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి రాత్రి విరమించారు. గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మన్ననూర్ మద్దిమడుగు ప్రధాన రహదారిపై అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సతీమణి మాజీ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ, సుజాతలు అమ్మవారిని దర్శించుకున్నారు. చారగొండ వెంకటేష్, మద్దెల చంద్రయ్య, అంబనారాయణ, లింగయ్య, బుచ్చయ్య, రామస్వామి, శేఖర్, స్వామి, రంజిత్, శివ నాయకులు పంబలి బుచ్చయ్య, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు కేటాయించాలని ఆందోళన

బల్మూర్: గ్రామీణ ప్రాంతాలకు అదనపు బస్సులు కేటాయించాలని మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపాలన్నారు. అదే విధంగా అచ్చంపేట నుంచి బల్మూర్ ద్వారా లింగాలకు నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. కార్యక్రమంలో లాల్ మహ్మద్, ఆంజనేయులు, మాసయ్య, రాజు, భాస్కర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా



దోమలపెంటలో ఉట్లు కొడుతున్న చిన్నారులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. తెలకపల్లి మార్కెండేయ దేవాలయం వద్ద యువకులు ఉత్సాహంగా ఉట్లు కొట్టారు. రాకొండ శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో అలరించారు. శ్రీకృష్ణమందిరం నిర్మాణం కోసం రూ.50 వేలు యాదవ సంఘం నాయకులు విరాళంగా అందజేశారు. పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్, గోపులాపూర్ గ్రామాల్లో వేణుగోపాలస్వామి, శ్రీకృష్ణదేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కొల్లాపూర్ పట్టణంలోని ఎనిమిదో వార్డు కృష్ణుడి ఆలయంలో రాధా మురళీ గోపాలకృష్ణ కల్యాణం నిర్వహించారు. మన్ననూర్ వేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో ఉట్లు కొట్టారు. వెల్దండ మండలంలోని నారాయణపూర్‌లో ఉట్లు కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దోమలపెంట, ఈగలపెంటలో ఉట్ల సంబరాలను తిలకించేందుకు గ్రామస్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్‌దేవాలయం, మార్చాలలోని హనుమాన్ దేవాలయం, కల్వకుర్తి వెంకటేశ్వర స్వామి దేవాలయం, పంజుగుల హనుమాన్ దేవాలయాలలో మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పెంట్లవెల్లి మండలం గోపులాపూర్‌లో



మన్ననూరులో..



కల్వకుర్తిలో

అటెన్షన్ ప్లీజ్

పిచ్చి మొక్కలను తొలగించండి



మర్రిపల్లి వెంకటేశ్వర కాలనీలో పిచ్చిమొక్కలు

సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేకాధికారుల పాలనలో పారిశుద్ధ్యం పడకేసింది. స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమం చేపట్టినా సంబంధిత అధికారులు మాత్రం నామమాత్రంగా పరిశుభ్రత పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. ఉప్పునుంతల మండలంలోని మర్రిపల్లి వెంకటేశ్వర కాలనీలో ఇళ్ల మధ్యనే పిచ్చిమొక్కలు పెరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో అపరిశుభ్రంగా వీధులు ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

– ఉప్పునుంతల

సంప్రదించవలసిన అధికారి: మోహన్‌లాల్, ఎంపీడీఓ, ఉప్పునుంతల, సెల్: 9281485037

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ఉప్పునుంతల: మండలంలోని ప్రమాదకరంగా ఉన్న రోడ్ల మూల మలుపులపై 'ప్రమాదాలపై పట్టింపేది' శీర్షికతో మంగళవారం సాక్షిలో కథనం ప్రచురితం అయ్యింది. దీంతో పోలీసులు స్పందించి ఉప్పునుంతల–అచ్చంపేట ప్రధాన రహదారిలో కట్లబండ మూల మలుపు వద్ద ప్రమాదాలను నియంత్రించడానికి చర్యలు చేపట్టారు. ఎస్ఐ లెనిన్ ఆధ్వర్యంలో మలుపు వద్ద సిమెంట్ కడీలను పాతించి వాటికి రేడియం స్టిక్కర్లను అంటించారు. పోలీసులు తీసుకున్న చర్యలపై స్థానికులు ప్రశంసిస్తున్నారు.



కడీలు ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లు వేయించిన ఎస్ఐ లెనిన్

బాధితుడికి ఆర్థికసాయం అందజేత

ఊర్కొండ: మండలంలోని బొమ్మరాజు పల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్యకు సంబంధించిన వ్యవసాయ భూమిలో మేకలపై గుర్తు తెలియని జంతువు ఆదివారం దాడి చేసి 13 మేకలు, రెండు లేగ దూడలను చంపింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన స్పందించి రూ.30 వేలు సమకూర్చి బాధితుడికి ఇవ్వాలని సూచించారు. అనంతరం మంగళవారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు బాధితుడికి నగదు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటయ్య నాయకులు సుల్తాన్, అల్వాల్ రెడ్డి, రాఘవేంద్ర, గోవిందు రాజు, ఆంజనేయులు, లోహిత్ రెడ్డి, జంగయ్య, విజేందర్‌రెడ్డి, సహదేవ్, ప్రవీణ్ చారి, తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని జిల్లెల్లలో గ్రామస్తుడు వెంకట్‌నారాయణ చారి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ రవిగౌడ్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుడి భార్య జ్యోతికి రూ.8 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో శ్యాంసుందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, శ్రీహరి, చిక్కొండ శ్రీశైలం పలువురు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న రాములు


రుణమాఫీ కోసం రైతుల వివరాలు నమోదు

వెల్దండ: రేషన్‌కార్డు లేని రైతులందరికీ రుణమాఫీకి వర్తిస్తుందని ఏఈఓ సురేష్ పేర్కొన్నారు. మంగళవారం రైతువేదికలో రేషన్‌కార్డు లేని రైతులను గుర్తించి ప్రభుత్వ యాప్ వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీలో భాగంగా రేషన్‌కార్డు లేని రైతులను గుర్తిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబంలోని సభ్యులందరికి ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్ జిరాక్స్‌లతో పాటు దరఖాస్తు ఫారం పూర్తి చేసి రైతులను సెల్ఫీ ఫొటోలు తీసి ఆన్‌లైన్ నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రేషన్‌కార్డు లేని రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



రైతుల సెల్ఫీ ఫొటోలు తీస్తున్న ఏఈఓ సురేష్

ఇంద్రధనస్సు కనువిందు



పట్టణంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంలో ఆకాశంలో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. స్థానికులు ఆసక్తికరంగా ఇంద్రధనస్సును తిలకించారు. హరివిల్లు చూడముచ్చటగా ఉండటంతో పలువురు కెమెరాలలో బంధించారు. ఆకాశంలో అర్ధచంద్రాకారంలో దర్శనమిచ్చింది.

– నాగర్‌కర్నూల్ రూరల్

డీఎల్‌పీఓకు వినతి

వనపర్తి రూరల్: గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులకు ప్రతి నెల మొదటి వారంలోనే జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో కలిసి డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.